# ఆఖరి నవ్వు

జీవితం అనుకొన్న విధంగాకాని, ఆశించిన రీతినికాని సాగదు. లభించిన దానితో తృప్తిచెందడం ఒక గొప్ప వరం. అయినా జీవితం దుఃఖభాజనమే అవుతుంది. సహించవచ్చు. అణగారిన ఆశలు ఫలించే అవకాశం గోచరిస్తే మాత్రం...?



వాసంతి

**మంగళవాద్యాలు** మారుమ్రోగిపోతున్నాయి. పిల్లల ఏడుపులూ, పెద్దల కేకలూ, యువకుల కలకలలూ, యువతుల కిలకిలలతో పందిరి ఎగిరిపోతూంది. పరికిణీల రెపరెపలతో, పట్టుచీరల సెంటు వాసనల గుబాళింపులతో, నీళ్ళు చల్లిన నేలనుంచి వచ్చే మట్టి వాసనలతో, వీచే చల్లటి గాలులతో, వంటశాలలోని పోపు వాసనల గుమాయింపుతో ఆ ప్రాంతమంతా ముగ్ధమనోహరంగా ఉంది.

అరిటిగెలలూ, కొబ్బరిబొండాలూ, ఆకుల కట్టలూ, వెండిపళ్లేలూ, పన్నీరుబుడ్లీ, గంధపు గిన్నె మొదలైన రకరకాలైన వెండి సామానులతో నిండి ఉన్న ఆ గదిలో కిటికీదగ్గర ఒక కుర్చీలో నిశ్చింతగా— ఇంత కలకలంలోనూ అతి నిశ్చింతగా ప్రశాంతతతో ఏకాంతంగా, అమ్మమ్మ కుట్టిన పూలజడతో అత్తయ్యచేసిన ముస్తాబుతో పెళ్లికూతురన్న ధ్యాసకూడా లేకుండా చేతిలో పుస్తకంతో థామస్ హార్డీ లోకంలో 'మార్టీ'తో విహరిస్తూంది — ఇంత హంగామాకు కారకురాలయిన విజయ.

అదే వీధిలో రెండిళ్ళవతల ఉన్న విడిది అంతా లైట్లతో వెలిగిపోతూ కారు హారన్‌ల వాద్యాలతో, మౌత్‌ఆర్గన్‌ల గోలతో, మోడరన్ యువ బ్రహ్మచారి సంఘ సభ్యుల నవ్వులతో, నాదలతో ఆడపెళ్ళి వారింటిని అపహాస్యంచేసేస్తూంది. అందమైన భార్య వస్తుందనే హుషారులో మిత్రులతో అల్లరి చేస్తున్నాడు పెళ్ళికొడుకు మోహన్.

## 2

మాంగల్యధారణ అయిపోయింది. జరుగవలసిన తతంగాలు పూర్తి అయ్యాయి. బాలభానుడు క్రమేపీ పైకి వస్తున్నాడు. చూడవచ్చిన స్నేహితురాండ్రకు కాఫీ, టిఫిన్ అందిస్తూంది విజయ.

తలంటిపోసుకున్న తల, వాడిపోబోతున్న సన్నజాజుల జడ, మెళ్లో రెండు పేటల ముత్యాల నెక్లెసు, ఒక చేతికి వాచీ, ఇంకో చేతికి నాలుగు బంగారు గాజులు, సన్నటి తెల్ల డెక్రాన్‌చీర, జరీ తళతళల మధ్య మెరుస్తున్న మంగళసూత్రం, కళ్యాణతిలకం, బరువుగా బద్ధకంగా ఉన్న నిద్రలేని కళ్ళు! అన్నిటికన్నా ముఖ్యం పెళ్ళయిన గంటలోనే అవరించిన గంభీరత — చేసుకున్నవాడు అదృష్టవంతుడే! విజయనే పరిశీలనగా చూస్తున్న 'ఫిజిక్స్ మేడమ్' నిర్ణయించారు మనసులోనే.

''ఇంతకీ అతనేం చేస్తున్నాడు, విజయా?''

''జయపూర్‌లో ఇంజనీరుటండీ!'' మేడమ్‌కు నిర్లిప్తంగా సమాధానమిచ్చింది విజయ.

''మేడమ్! విజ్జీకి ఇష్టం లేనట్టుందండీ ఈ పెళ్ళి. ఏమిటో మరీ విరాగిణిలా ఉంటూంది మధ్య!''

''మా యిష్టాయిష్టాలతో పనేముంది, కుసుం? 'మేరేజ్ ఈస్ మేడ్ ఇన్ హెవెన్'. ఫేట్‌కు ఎదురీదడం నాకిష్టం లేదు. 'అఫ్ కోర్స్' ఈ విషయంలో కాదనుకో. దేన్లోనయినా నా ఐడియా చెప్పా!'' కుసుమకు వేదాంతినిలా ఇచ్చింది జవాబు విజయ.

''అసలు మేరేజ్‌కు ముందు చూసుకున్నావా, విజయా?'' మేడమ్ అడిగారు.

''అలా చూడ్డం నాకిష్టముండదండీ. నే చూసి కావాలన్నా, వద్దన్నా జరుగబోయేదెలాగూ జరుగక మానదు కదండీ. నా అదృష్టమెలా ఉంటే అలానే జరుగుతుంది.

అసలొకవేళ నేచూసి నాకు నచ్చేడనుకోండి ఏ అబ్బాయయినా. అప్పుడతనికి నేనచ్చలేదనుకోండి. ఆ అబ్బాయే మనసులో ఉంటే మరొకరిని ఎలా చేసుకోవాలి? మానసికంగానయినా అలా చేయడం తప్పనే నా ఊహ. అందుకే, నేనెవర్నీ ఇంతవరకూ చూడలేదసలు. నా మనసు నాకు

తెలుసు. పొరపాటున ఎవరైనా వచ్చితే నా మట్టుకు నేను ఇంకోళ్ళని చేసుకోలేనేమో నని పిస్తుంది. అయినా, 'మా పేరెంట్స్' కన్నా నా బాగోగులు నాకేం తెలుస్తుంది, చెప్పండి?"

"విజయ ఉట్టి పెసిమిస్ట్. అందుకే పోర్ట్రీ అంటే అంత మోజు." భామ అంది.

"పెసిమిజమ్‌లో ఉన్నంత సంతృప్తి ఇంకెందులోనూ ఉండదు, తెలుసా?" విజయ బలపరిచింది.

* * *

"విజయేది?"

"లోపల వాళ్ళ స్నేహితులతో ఉన్నట్టుంది."

"అది షాక్ తినేట్టు చేయొద్దవరూ. అసలే అది చాలా సెన్సిటివ్!"

"అమ్మా, విజయా! ఆఖరికి నీ అదృష్టమిలా ఉందాతల్లీ! నీవెంతో అదృష్టవంతురాలనని మురిసిపోయేనే?"

అక్కయ్య, నాన్నమాటలు, అమ్మ ఏడుపు గొంతు విన్న విజయ అయోమయంగా బయటికి వచ్చింది. అందరూ బయటకు వచ్చేశారు.

విషయం విన్న విజయ అచేతనురాలయి పోయింది. ఒక కన్నీటిచుక్క కూడా రాలేదు. కన్నీరింకిన కళ్ళతో అలా బొమ్మలా శూన్యంలోకి చూస్తుండి పోయింది.

## 3

సంతోష వాహినిలో తేలే ఆ పెళ్ళిల్లు శోక వాహినిలో మునిగిపోయింది. ఈ క్షణం మన దయితే మరుక్షణం మనదికాదు — అన్న వేదాంతుల నిర్వచనం అక్షరాలా నిజం.

వరంధామయ్యగారి దుఃఖానికి అంతేలేదు. అయిదేళ్ళబట్టి వెతికి వెతికి చివరికి సంబంధం కుదిరింది. విజయ తరువాత పెళ్ళికెదిగిన కూతుళ్ళిద్దరున్నారు. ఆఖరికి విజయ గతి ఇలా అయింది. ఎవరి కర్మానికి ఎవరు కర్తలు?

నిక్షేపంలాంటి అబ్బాయి నిమిషాలమీద కడుపు నొప్పితో చచ్చిపోవడమేమిటి? అంతా కాలమహిమ! ఆ చచ్చిపోయేది సూత్రధారణయ్యాకే చావాలా? బుర్ర గోడకు కొట్టుకున్నారు వరంధామయ్యగారు.

"ఇలా పుస్తె కట్టాడో, లేదో అలా తారుమన్నాడు!"

"తెలిక చేసుకున్నాం. ముదనష్టపు జాతకం! నిండు ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది పాపిష్ఠి ముండ!" శోకాలు, రాగాలు తీశారు అత్తింటి వారు.

రోజులు గడుస్తున్నాయి. రానురాను నిర్లిప్తత ఎక్కువయింది విజయకు. నిరాశకు ఆలవాలమైంది. ఏదీ తినదు. ఏమీ చేయదు. అలా పిచ్చిదానిలా శూన్యంలోకి చూస్తూ కూర్చుంటుంది. కాసేపు ఏడుస్తుంది. కాసేపు హుషారుగా ఉంటుంది. అసలు దుఃఖమనేది లేదు ఆమెకు, పాటి మానవుడు పోయాడనే బాధతప్ప. ఎవరి కర్మకు ఎవరు కర్తలు?— అనుకుంటుంది. అలా నిశ్శబ్దంగా కూర్చుని కాల్పనిక జగత్తులో

# ఆఖరి నవ్వు

ఊహించుకుంటూ అదే నిజమనుకొని తృప్తి పడుతుంటుంది.

కొన్ని నెలలు గడిచాయి. ప్రమత్తాన్ని మరిచి పోవడానికి విజయ లాకాలేజిలో చేరింది. గతాన్ని మరిచింది. ఉత్సాహంగా ముందుకు చదువుకు పోతూంది.


వరంధామయ్యగారు, విజయ పెద్దన్న లాయరు విశ్వనాథంఎంతమందినో పెద్దలనుకలుసుకున్నారు. మతాధికారులను సంప్రదించారు. వాదించారు. న్యాయశాస్త్ర ధర్మాలను బయటికి లాగారు. పరిశోధించారు. ఆఖరికి పెద్దలందరి సమక్షంలో నిర్ణయించారు—పెళ్ళిలో ఒక ముఖ్యఘట్టమైన 'సప్తపది' కానిదే పెళ్ళి పూర్తి కాలేదనీ, కాబట్టి పెళ్ళయిన గంటలోనే మాంగల్యశోభ తీరిపోలేదనీ, పునర్వివాహానికి వధువు అర్హురాలనీ.

వరంధామయ్య దంపతులు, కుమారుడు విశ్వం కూడా కొండెక్కినంత సంబరపడ్డారు.

విజయ ఏ విషయంలోనూ కల్పించుకోలేదు. వరంధామయ్యగారు ప్రయత్నాలు ప్రారంభించారు. చేసుకోవడానికి ముందుకెవరూ రాలేదు. ఒకరు పెళ్ళయిన గంటలోనే అమరలోక ప్రయాణంచేస్తే, చూస్తూ చూస్తూ ఏతల్లి తండ్రులు తమ కుమారుల నిస్తారు, ఎంత చదువుకుని నాగరికత పెంపొందించుకున్నామని విర్రవీగినా? అయినా సింగినాదం, వాడెవడో చచ్చిపోతే మిగిలినవాళ్ళు చావాలని పిచ్చి సిద్ధాంతమేమిటి?— అని ఒకరిద్దరు ముందుకు వచ్చి మళ్ళీ కాస్త ఆలోచించాక 'బాబోయ్! ఒకవేళ పోతే నిజంగానే! ఎందుకొచ్చిన గొడవ! బతికుంటే ఎక్కడయినా ఉండవచ్చు' అంటూ భయపడి తప్పుకున్నారు.

ప్రయత్నాల మాటలలా ఉండగా విజయ లా పట్టా పుచ్చుకుంది.

ప్రాక్టీసు పెడదామంటే నాన్న వద్దంటారు. అన్నీ అనుమానాలే! అన్నీ భయాలే! సంఘం! ఎవ్వరి సంఘం? మంచికి ఓర్వలేని ఈ సంఘం




చిత్రం—కలువకొలను సదానంద (పాకాల)

చెడుకు ఆదుకుంటుందా? విజయ మనసు పరిపరి విధాల పరిగెడుతూంది. వరంధామయ్యగారు మాత్రం పాపం పిల్లలకు సంబంధాలు చూస్తూ ఉన్నారు. ఎవరికీ ఏవీ కుదరడం లేదు.

## 4

దూరంగా ఎక్కడో మిలిటరీ బ్యాండు విని పిస్తూంది. ఎన్. సి. సి. ప్రాక్టీసు కాబోలు!

వీధిలో జంటలు ముచ్చటగా వెడుతున్నారు సినిమాకు. ఆఫీసునుంచి ఇంటికి వచ్చేవాళ్ళు వస్తున్నారు. అక్కడక్కడ రిక్షా సైకిళ్ళ బెల్లులు మోగుతున్నాయి.

లాడ్జిలో అబ్బాయిలల్లరిగా ఆకతాయితనంగా వీధిలో వచ్చే పోయేవారిని ఏడిపిస్తున్నారు. ఆలస్యంగా ఆటలయి అలిసిపోయి యింటికి వచ్చే అమ్మాయిలు కంగారుగా, తొందరగా, నిమ్మగా, వయ్యారంగా వెడుతున్నారు అబ్బాయిల గోల వినీ విననట్టుగా, బెరుగ్గా.

కచేరీలో ఆరుగంటలు కొట్టారు. ఆరు బయట తోటలో కూచుని ఉంది విజయ.

"ఏమండీ, నాన్నగారున్నారా?"

పరధ్యానంగా పుస్తకంలో మునిగి ఉన్నవిజయ ఉలిక్కిపడి తలెత్తింది. ఎదురుగా మురళి. పేరు పొందిన లక్షాధికారుల ఏకైక గారాల పుత్రుడు, 'ఫారెన్ రిటర్న్‌డ్' ఆఫీసరు. ఆ ఊళ్ళోకల్లా మోస్ట్ ఎలిజిబుల్ బాచిలర్!

"ఉన్నారు. లోపలున్నట్టున్నారు, పిలుస్తా. ఇలా కూర్చోండి!" కుర్చీ చూపించి లోపలికి వెళ్ళింది.

కుర్చీలో ఉన్న 'సింగింగ్ స్కర్ట్స్'ను పాలోచనగా చూస్తూ కూర్చున్నాడు మురళి.

కాసేపటికి కాఫీ తీసుకు వచ్చిన విజయ, నాన్నగారు, మురళి ఏదో తీవ్రంగా మాటల్లో ఉండడం చూసి గ్లాసు చప్పుడయ్యేలా స్టూలుమీద పెట్టి లోపలికి రాబోయింది.

"రామ్మా! విజయా! కాసేపు మురళితో మాట్లాడుతూండు. ఇప్పుడే వస్తా.... తీసుకోవోయ్." హడావిడిగా కాఫీ మురళికిచ్చి సంతోషంగా బయటికి వెళ్ళుతున్న నాన్నగారిని చూస్తూ అయోమయంగా ఉండిపోయింది విజయ.

"చూడండీ!.... మీరు.... మరేమీ అనుకోక పోతే ఒక చిన్న విషయం మాట్లాడాలనుకుంటున్నా. ఇఫ్ యు డోంట్ మైండ్ వోన్న!" కాఫీ చప్పరిస్తూ అర్థించాడు విజయను మురళి.

"దానికేం? తప్పకుండా చెప్పండి." తనకు తెలిసినప్పటినుంచీ అతనిపై సదభిప్రాయం పెంచుకొన్న విజయ చిరునవ్వుతో అంది.

"మిమ్మల్ని..... మీకు అభ్యంతరం లేకపోతే వివాహం చేసుకోవాలనుకుంటున్నా. మీ అభిప్రాయం స్వయంగా తెలుసుకోమన్నారు మీ నాన్నారు." సూటిగా చూస్తూ అడిగాడు మురళి.

"ఎదుటవారి ఆదర్శాలకోసం నా వ్యక్తిత్వం చంపుకోవడం నాకిష్టం లేదు. ఇంతమందీ ఎవరూ ఒప్పుకోకపోయినా మీరు సిద్ధపడడంలో

గరి ఆంతర్యం నా కర్థంకావంత అవివేకురాల్ని మాత్రం కాదు నేను. మీ ఆదర్శం లోకవ్యాప్తి కావాలని అనుకుంటే, మీ 'ఫారెన్ డిగ్రీ' పక్కన ఇంకో బిరుదు పెట్టుకోవాలనుకుంటే ఏదైనా సమాజానికి వెళ్ళి సంపాదించుకోండి. ఈ వీధిలో ఉండి, పక్క ఇంటిలో ఉండి, కళ్లెదురుగా పెళ్ళి జరుగుతూ ఉంటే చూస్తూ కూచున్న మీకు ఈనాటికింత సద్బుద్ధి ఎలా కలిగిందో నాకు తెలీదు. మీ దయా ధర్మాలు నాకక్కర్లేదు. దయచేసి నన్నవమానం పాలు చేసి నా జీవితం నాశనం చెయ్యద్దని చేతులు జోడించి మరీ ప్రార్థిస్తున్నా. నన్నిలా బ్రతక నివ్వండి......"

ఎర్రగా కందిపోయిన ముఖంతో ఆవేశంతో చెప్పుకుపోతూన్న విజయకు దుఃఖం ఆగలేదు.

"ఎక్స్క్యూజ్ మీ! సహృదయులైన మీమనసు నొప్పించి ఉంటే....." కళ్ళు తుడుచుకుని వెనక్కు తిరిగి అంది.

"కీర్తికోసమయితే మిమ్మల్నే ఎందుకెన్నుకోవాలి! ఇంకా మీరన్నట్టు ఎంతమందో ఉన్నారు. అయినా మిమ్మల్ని వివాహం చేసుకోవడంలో ఆదర్శమనేది ఏదీ ఉండదు ఎవరికయినా." విసవిసా వెళ్ళిపోతున్న విజయ, మురళి తాపీగా, నిండుగా, నిదానంగా అన్న మాటలకు వెనక్కు తిరిగింది.

"అయితే.... ఇదివరకు.... అంటే ఇవేవీ జరక్కపూర్వం మీకీ ఉద్దేశ్యం కలగలేదా?" సూటిగా క్రాస్ పరీక్ష చేసింది కోపాన్ని ఉపాయించుకొని విజయ.

"యువరానర్! పొరపడుతున్నారు! నాకీ ఉద్దేశ్యం ఎప్పట్నుంచి ఉందో చెప్పడానికి చాలామంది సాక్షులున్నారండి! ముఖ్యులు మీనాన్నారు శ్రీ పరంధామయ్యగారు. కారణం కూడా సెలవీయమంటారా? రెండేళ్ళ క్రితం— అంటే మీపెళ్ళి జరక్కపూర్వం మానాన్నగారిని నేను స్వయంగా అడిగి మీనాన్నగారి దగ్గరకు పంపితే, ఆయన ఇష్టపడక కాస్త కఠినంగా మాట్లాడారట. నేనెంత చెప్పినా ఒప్పిస్తానని మానాన్నగారు ఆగక పంతానికి ఇదంతా చేశారు. మానాన్నగారి మొండి పట్టుదల ఇన్నాళ్ళవరకూ తగ్గలేదు. ఆఖరికి వజ్రం వజ్రాన్ని కోస్తుందన్నట్లు నా మొండి పట్టుదలకు లొంగి ఒప్పుకున్నారు.

"రెండేళ్ళబట్టీ పడ్డ కష్టమంతా రెండు క్షణాల్లో ఇంత బాగా అర్థం చేసుకున్న మీ 'లా'ను ఎలా అభినందించాలో!......"

చేతులు కట్టుకుని దీనంగా కోర్టులో అపజయమనేది తెలిసి ఓ పెద్దలాయరు చెప్పేట్టు చెబుతున్న అందమైన మురళిని చూస్తూన్న విజయ మోహం క్రోధంతో మండిపడుతున్న చండప్రచండ భానుని నుంచి క్రమేపీ గులాబీ వన్నెకు తగ్గి ముకుళించుకుని పోయింది మను సిగుతో.

"సారీ! ఏమిటో ఆవేశం వస్తే నేనెప్పుడూ అంతే. ఎంత పడితే అంతా మాట్లాడేస్తాను! ఆనాడు వివాహ విషయంలో నా నిర్ణయం లేదు. ఈనాడూ అంతే! ఎటొచ్చీ అప్పుడు నా జీవిత కథలో బ్రహ్మ వ్రాసిన కథానాయకుడు వారైతే, ఇప్పుడు నేను వ్రాసే కథల్లో నా కథానాయకులు మీరు! అంతే!" గబగబా లోపలికి పరుగుతీసింది.

"ఎలా అయితేనేం గానీ! అబ్బ! నిజంగా కోపంలో.... నిర్వచించలేరు.... ఎవరూ మీ అందాన్ని! ఇంతకీ నేనదృష్టవంతుణ్ణే." తృప్తిగా చెబుతున్న మాటలు వెళ్ళుతున్న తన చెవినిపడి సంతృప్తిగా చిరునవ్వు నవ్వుకుంది విజయ మనసు.

"అందని ద్రాక్షపండుగా ఊహించి నిర్లిప్తతతో అనర్హురాలనని ఊరుకుని, కథల్లో రాకుమారునిగా చిత్రించడంలో సంతోషం పొందుతున్నతన్ను నిజంగానే మురళి పెళ్లిచేసుకుంటాడా?

".....తీయని ఊహలూ, పగటి కలలూ, కథలూ! నిజమవుతున్నాయా తనపాలిట? నిజమేనా?

"సామాన్యులకు అందుబాటులో లేడనే ఆశలు తెంచుకున్న ఈ మురళి! తన మురళి! శాశ్వతంగా తనవాడవుతున్నాడా!

"కలలన్నీ నిజమవుతున్నాయి! కోరుకున్న వరం సిద్ధిస్తూంది!......"

విజయ హృదయం పరవళ్ళు తొక్కింది సంతోషంతో.

"నిజంగా తనంత అదృష్టవంతురాలా! బాబోయ్!...... మురళికి.... కూడా మోహన్‌గతే పట్టదు కదా!" గుండె దడదడా కొట్టుకుంది. ముచ్చెమటలు పోసింది. పెట్టుకున్న బొట్టు చెమటలో కరిగిపోయింది.

"ఊహూ! అలా జరగడానికి వీల్లేదు. అయినా ఏమిటీ ఇంత అవివేకంగా ఆలోచిస్తున్నానేను— ఇంత చదువుకున్నా కూడా? 'ఫేట్ ఈజ్ ది డెస్టినీ ఆఫ్ లైఫ్.'అంతే! వాటీజ్‌దేర్!ఆల్టర్నల్!"

సమాధానపరుచుకుని బొట్టు దిద్దుకుంటున్న విజయ ఈజీచెయిర్‌లో కూలబడింది.

అతివేగంగా కొట్టుకుంటూంది గుండె. ఒక వైపు పట్టరాని సంతోషం! మరోవైపు పట్టరాని భయం—కలచెదిరి పోతుందేమోనని!

"అమ్మా! విజ్జీ!" లోపలికి వచ్చారు పరంధామయ్యగారు.

బరువుగా, వెక్కుతూ శ్వాస తీస్తూన్న విజయను చూడగానే అదిరిపోయారు. మోహమంతా చెమట! ఒళ్ళంతా చెమట! చల్లగా మంచులా ఉంది ఒళ్ళంతా.

అరగంటలో చుట్టూ డాక్టర్లూ, నర్సులూ గుమిగూడారు. గ్లూకోజ్ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. నర్సు అరికాళ్ళకు, చేతులకు ఒళ్ళంతా బ్రాందీ రుద్దుతూంది.

ఏమీ చేయలేని మురళి మంచులాటి ఆమె రెండు చేతులూ తన చేతిలోకి తీసుకుని తడిసిన ముఖాన్ని విడవకుండా తుడుస్తూ నుదుటిమీది వెంట్రుకలను పైకి తీస్తున్నాడు.

"విజయా......!" గాద్గదికంగా పలుకుతూ పలికింది మురళి గొంతుక.



ఊహాసుందరి

చిత్రం—కె. రంగారావు (రాజమండ్రి)

ధైర్యం చెబుతున్నట్లుగా ఒక్కసారి కళ్ళు తెరిచి తల అడ్డంగా ఊపింది విజయ.

తృప్తిగా, సర్వసంగ పరిత్యాగినిలా, నిండుగా, ఆప్యాయంగా, ఆత్మార్పణ చేస్తున్న యోగినిలా, అనురాగం వర్షించేట్టుగా, అందరినీ వదిలివేస్తున్నాననే దుఃఖంతో అంతులేనిఅనురాగాన్ని చిందిస్తూ దుఃఖాన్ని అరికట్టేటట్టు ఒక్క నవ్వు నవ్వింది, తృప్తిగా తన్ను పొదివి పట్టుకున్న మురళి వైపు చూసి, దేవతామూర్తిలా.

నిర్మలమైన నిండు గోదావరిలో అస్తమయ సూర్యుని ప్రతిబింబంలా మెరుస్తున్న విజయ నుదుటిపైన ఎర్రటి తిలకాన్నే చూస్తూన్న మురళి, తనకు తెలీకుండానే చెమటకు కరిగి కారుతున్న ఆ తిలకాన్ని సరిదిద్దాడు.

ప్రాణాధికంగా ప్రేమించిన తన విజయకు కడసారి ఒక కన్నీటిచుక్క ఇవ్వడానికి కూడా అశక్తుడయిపోయాడు.

అర్థం తెలీని ఆ నవ్వు, కడసారి ఒక పలుకయినా పలుకని ఆమె మనసు నిండిన ఆ చిన్న నవ్వు,దుఃఖాన్ని దిగమింగడానికి వ్యర్థప్రయత్నాలు చేస్తూ, తీరని కోరికలు లేవనే సంతృప్తితో కోరుకున్న వ్యక్తి ఒళ్లో— ముఖ్యంగా నుదుట తిలకంతో భర్త సాన్నిధ్యంలో జీవితాన్నర్పిస్తున్నాననే సంతోషభరితమైన ఆ నవ్వు, సుఖదుఃఖ సమ్మేళనమైన ఈ జీవితంలో ప్రతి ఒక్కరికీ చరమదశ యిదేకదా! ఈ క్షణభంగురమయిన ఈ జీవిత పోరాటంలో ఇంత అవివేకంగా అలసట చెందింది! అనే నగ్నసత్యాన్ని, జీవిత పరమార్థాన్ని చివరి క్షణంలోనయినా తెలుసుకున్నామనే ఆత్మతృప్తితో నిండిన ఆ ఆఖరి నవ్వు— మురళి హృదయంలో శాశ్వత ముద్ర వేసుకుంది విజయ రూపానికి ప్రతిబింబంగా. ★